# పుణ్యం కొద్దీ...

తనకు పెళ్ళి కుదిరిందంటే ఆశ్చర్యంగా ఉంది సునీతకు. నమ్మలేని నిజం. ఇంట్లో హడావిడి, పెళ్ళి ప్రయత్నాలు, ఆహ్వాన పత్రికలు చూస్తుంటే నమ్మక తప్పలేదు. పెళ్ళి కొడుకు నిజంగానే ఒప్పుకొన్నాడా లేక ఎవరైనా అతన్ని బలవంతం మీద ఒప్పించారా అన్నది తనకు తెగని సమస్యయి కూర్చుంది. అతను విద్యాధికుడు. పైగా అందగాడు. మంచి ఉద్యోగంలో ఉన్నవాడు. అతనితో పోల్చుకుంటే తను ఎందులో సరితూగగలదు?

పెళ్ళి చూపుల్లో కూడ తనను బెదరగొట్టలేదు. ఆ అడిగిన రెండు మూడు ప్రశ్నలూ పక్కవాళ్ళ బలవంతం మీద అడిగాడేమోననిపించింది.

"మీ పేరేమిటి?"

"సునీత" - కొద్దిగా తలెత్తి చూసింది.

అతని కళ్ళు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. మగవాడికి అంత అందమైన కళ్ళా అని విస్తుబోయింది.

"నా పేరు రాజశేఖర్. ఆర్ట్సు కాలేజిలో ఇంగ్లీషు లెక్చరరుగా పనిచేస్తున్నాను."

ఆ వివరాలన్నీ తనకెందుకు? బహుశా చదువుకొన్న వారి పరిచయాలు అలా ఉంటాయి కాబోలు.

"మీరు చదువుకొంటున్నారా?" అది రెండో ప్రశ్న.

లేదని తల అడ్డంగా తిప్పింది. అతనింకా తననే చూస్తున్నాడు.

"స్కూలు ఫైనల్ వరకు చదివాను. ఆ తర్వాత నాన్నగారు మానిపించేశారు."

పక్కనే కూర్చున్న అమ్మ తన చేయి నొక్కింది ఇక చాలించమన్నట్టు. ఇంకా ఏమి ప్రశ్నలడుగుతారోనని తన గుండె గుబగుబలాడింది.

"మీ హాబీ ఏమిటి?"

హు... తనకు హాబీ ఏమిటి? స్కూల్లో హాబీ కోసం వారానికి ఒక పీరియడు కేటాయించేవారు. అప్పుడు మహా అంటే ఓ బక్కెటు నీళ్ళు పూల మొక్కలకు పోసేది. లేదా లైబ్రరీ పుస్తకం అడ్డు పెట్టుకొని తనూ, వనజా కబుర్లు చెప్పుకొనేవారు.

"జవాబు చెప్పు..."

అమ్మ నన్ను హెచ్చరించింది. తను నవ్వేసింది స్కూలు జ్ఞాపకాలతో.

అతనూ పెదవులలో నవ్వు దాచుకొంటూ, "పుస్తకాలు చదువుతుంటారా! కథలు, నవలలు అంటే ఇష్టమా" అని అడిగాడు.

"ఓ ... చాలా ఇష్టం" అంటూ ఉత్సాహంతో చెప్పింది. నాన్నగారు చురచుర చూస్తున్నట్టు అనిపించింది.

ఐదు నిముషాల తర్వాత వాళ్ళు వెళ్తామంటూ లేచారు. వాళ్ళు వెళ్ళిన తర్వాత నాన్నగారు కోప్పడ్డారు. "నీకు ఆ వెధవ పుస్తకాలు చదవొద్దని ఎన్నిసార్లు చెప్పాను. పైగా అవంటే చాలా ఇష్టం అంటూ మహా గొప్ప విషయంగా చెబుతోంది. ఈ సంబంధమైనా కుదురుతుందో లేదో! అసలే అపురూప సౌందర్యం దానికి తగినట్లు వెకిలి చేష్టలు."

తనకు ఏడుపొచ్చింది. అందంగా లేకపోతే ఆ తప్పు తనదా? ఎందుకన్ని సార్లు తన సౌందర్యలేమిని గుర్తుకు తెస్తారు? పుస్తకాలు కూడా చదవకపోతే తనిక చేయగలిగేదేముంది? అని తనకెంత తృప్తినిస్తాయో నాన్నగారికెలా అర్థమవుతుంది?

వారం రోజులు గడచినా ఇంట్లో వారి సాధింపులు తగ్గలేదు. అందరి భయాలు తొలగిస్తూ వారి ఉత్తరం రానే వచ్చింది. ముహూర్తం కుదుర్చుకోటానికి వస్తున్నారట.

ముహూర్తం పెట్టుకొనే రోజు మాత్రం పెళ్ళికొడుకు తల్లి తనను చూసి పెదవి విరచలేదు! ఆమె వనజ తల్లితో చెబుతుంటే స్పష్టంగా వింది తను. "పెళ్ళి చూపులకు నేను వచ్చుంటే ఈ సంబంధానికి ఒప్పుకొనేదాన్నా? మీ అమ్మాయి లేదూ చిదిమి దీపం పెట్టుకొనేలా? మా వాడికి ఎటువంటి సంబంధాలు రాలేదూ? అవన్నీ కాదని దీనికి ఒప్పుకోడమేమిటో. కోడలు నలుపైతే కులమంతా నలుపంటారు. మాకు అట్లా రాసిపెట్టుంది ఏం చేస్తాం?"

★ ★ ★

పెళ్ళి పందిట్లో బాజాలు మోగుతున్నాయి. సునీతను అలంకరిస్తున్నారు. గది నిండుగా మనుషులే. శరీరమంతా చెమటతో తడుస్తోంది. అయినా తనకు చీర కట్టుకోటం రాదా ఏమిటి? వీళ్ళిలా బిగదీసి కట్టాలా? వీళ్ళందరినీ తప్పించుకొని ఒకసారి తనను నిలువుటద్దంలో చూసుకోవాలనిపించింది. కానీ చుట్టూ మనుషులు. అద్దం దగ్గర ఒకావిడ తలదువ్వుకొంటోంది. ఇంకొకామె పౌడరద్దుకొంటోంది. ఒక నాలుగేళ్ళ పాప పౌడరు ఇల్లంతా చల్లుతోంది.

ఇంతలో పిలుపు "త్వరగా తెమలండి. ముహూర్తం దాటిపోతోంది" సునీతను ఎవరో చేయి పుచ్చుకు నడిపించారు. మల్లెపూల వాసన. గంధం, పన్నీరు... అన్ని పరిమళాలు. సునీతకు మెడలో దండ బరువుగా తోచింది.

పెళ్ళి పీటల మీద కూర్చోగానే గాలివాటుగా వినిపించింది. "మా చెల్లెలి కూతురు - ఎంత అందంగా ఉంటుందనీ! దాన్ని కాదని ఈ రంభను చేసుకొంటున్నాడే శేఖర్."

పెళ్ళి మంత్రాలలో, తక్కిన గొడవల్లో ఇంకేమీ వినిపించలేదు. మంగళ సూత్రధారణ సమయంలో సునీత కళ్ళు తళతళలాడిపోయాయి. దుఃఖమో, ఆనందమో, కృతజ్ఞతో తెలియని స్థితి.

కొత్త కాపురం సర్దుకొన్నాక కూడా తన భర్త తనను నిర్లక్ష్యం చేయకపోవటం, నిరసనగా మాట్లాడకపోవటం సునీతకు ఆశ్చర్యం కలిగించింది. ఆయన పక్కన నిల్చుని తనెన్ని సార్లు అద్దంలో చూసుకోలేదు! ఆ పసిమిరంగుకి, తన చామన ఛాయకు గొప్ప కాంట్రాస్టు. కను ముక్కు తీరు మాత్రం ఆయనతో తను పోటీపడగలదా? ఆయన పెదవులు ఎప్పుడూ, నవ్వుతూ ఉంటాయదేమిటో! అయినా తనకు అర్థం కాదు. మగవాడికి పగడాల వంటి పెదవులెందుకు?

ఒకనాడు రాజశేఖరన్నాడు "సునీ, రమేశ్‌గారు భోజనానికి పిలిచారు."

సునీత గొంతులో వెలక్కాయ పడ్డట్టయింది.

"సాయంత్రం నేనొచ్చేసరికి సిద్ధంగా ఉండు."

"ఈ విందులూ, వినోదాలు... నాకు నచ్చవు" అంది తలవంచుకొని.

"ఎందుకనీ?"

"అన్నీ నా చేతే చెప్పించాలా? మీకు తెలియదూ నేనొక పల్లెటూరి మొద్దుననీ, వీటన్నింటికీ తగనని."

ఆమె చుబుకాన్ని వేలితో తాకుతూ "చూడు, ఈ కబుర్లన్నీ నాతో చెప్పకు. నాకిష్టమైన పనులు నా కోసం చేయొచ్చుగదా?"

అతని బలమైన చేతిని తన చేతుల్లో పదిలపరుచుకొంది సునీత.

"ఎప్పుడూ దిగులుగా ఉంటావేం? కొత్త స్థలంలో కొత్త వ్యక్తితో గడపటం కష్టంగా ఉందా?" మృదువుగా అడిగాడు.

"కష్టమేమిటి? ఇంతకు మించిన సుఖం నాకేదీ లేదు. కానీ ... మీరు చేసిన త్యాగమే నన్ను ఎప్పుడూ బాధపెడుతూ ఉంటుంది."

"త్యాగమా? నేనేం త్యాగం చేశాను?"

"నన్ను వివాహం చేసుకోటం త్యాగం కాదేమో చెప్పండి. ఈ మొహంలో ఏం చూసి చేసుకొన్నారు? కళా? కాంతా? సున్నితత్వమా? అందమా? ఈ వికారాన్ని మనసారా ఎందుకు ఎంచుకొన్నారు?" అతని మొహానికి దగ్గరగా మొహం పెట్టి అడిగింది.

ఆమె మొహాన్ని మరింత దగ్గరగా లాక్కుని చుంబించి వదిలేశాడు రాజు.

"సాయంత్రం రెడీగా ఉండు అక్కడికి వెళ్లాలి" అని హెచ్చరించి కాలేజికి వెళ్ళిపోయాడు.

★ ★ ★

రమేష్, అతని భార్యా చాలా ఆదరంగా పలుకరించారు. విశాల సునీతను లోపలికి తీసుకెళ్ళి కూర్చోబెట్టుకొంది. ఈ కబుర్లు, ఆ కబుర్లు చెబుతూ ఫొటో ఆల్బం చూపిస్తూ సునీత బెరుకుతనాన్ని పోగొట్టింది.

ఆ పక్కనే ఉన్న తంబుర చూస్తూ "మీకు సంగీతం వచ్చినట్లుందే" అంది సునీత.

"ప్చ... ఏదో బి.ఏ.లో మ్యూజిక్ తీసుకొన్నాను. ఈ మధ్య తీరుబడి లేక సాధన చేయటం లేదు." "సంగీతం వచ్చిన వాళ్ళకు అంత నిర్లక్ష్యం కాబోలు."

"పెద్ద... మీకు రానట్లు."

"ఏమిటి? నాకు సంగీతమా? వేళాకోళానికి మరే విషయమూ దొరకలేదా?"

"మీ మాటలు నేను నమ్మనండోయ్.... శేఖరమన్నయ్యకు సంగీతమంటే ఎంత ఇష్టం! తనో సంగీత లక్ష్మిని చేసుకొంటాడని ఊహించాం అందరమూ."

ఇంతలో రమేశ్ పిలుపు వినిపించింది. "ఈ రోజు భోజనాల మాటేమయినా ఉందా లేక.... కబుర్లతోనే కడుపు నింపేస్తావా?"

"ఇదిగో వస్తున్నా..." అంటూ. "రండి..." అని సునీతను తనతోపాటు తీసుకెళ్ళింది విశాల.

"భోజనాల సంగతి తర్వాత. ముందు మీ పాట వినిపించండి. చాలా రోజులయింది. మీ పాట విని..." అన్నాడు రాజశేఖర్.

ఏమాత్రం సంకోచం లేకుండా మూడు కృతులు పాడింది విశాల. చక్కటి గాత్రం. సునీత తన భర్త వైపు చూసింది. ఆయన సంగీత ప్రపంచంలో మునిగిపోయాడు.

ఇంటికి వచ్చే వరకు, వాళ్ళిద్దరి మధ్యా మౌనం రాజ్యం చేసింది. పన్నెండు గంటలు కావస్తున్నా సునీత పడుకోటానికి రాకపోయే సరికి తనేమి చేస్తూందో చూడాలని అవతలికి వచ్చాడు రాజు. పిట్టగోడను ఆనుకొని అనంతమైన చీకట్లోకి చూస్తూ ఉంది సునీత.

"చీకట్లో ఏం చేస్తున్నావు సునీ?" అంటూ లైటు వేశాడు. లైటు వెలుగులో తళుక్కున మెరిశాయి సునీత కన్నీళ్ళు.

"ఏమయింది సునీ. నీ మనసేమయినా నొప్పించానా? రమేశ్ ఇంట్లో ఏమైనా జరిగిందా?"

ఆదరంగా అడుగుతున్న అతని గుండెలపై వాలి ఏడ్చేసింది బిగ్గరగా.

"నన్నెందుకు పెళ్ళి చేసుకొన్నారు? నేను మీకు తగను" అంది వెక్కుతూ.

"నీ ప్రవర్తన నాకు అర్థం కావటంలేదు సునీ... నిన్ను నువ్వు తక్కువగా ఎందుకనుకొంటావు? నచ్చి పెళ్ళాడింది నేను కదా? నీ కొచ్చిన కష్టమేమిటి చెప్పు."

"మీకు సంగీతమంటే అంత అభిమానం కదా! నాకు ఒక పాటయినా రాదు కదా! ఆ విశాల పాడుతున్నప్పుడు మీకే మనిపించింది? ఎవరైనా తీయగా పాడుతుంటే మీకేం బాధ కలగదూ? ఎందుకు చేసుకొన్నానా ఈ పెళ్ళి అని పశ్చాత్తాప పడరూ?"

"పిచ్చి సునీ. ఈ ఊహలు నీ బుర్రలోంచి ఎలా తొలగించాలో నాకు అర్థం కావటం లేదు. ప్రపంచంలో అందరూ సంగీత విద్వాంసులూ. అసమాన సౌందర్యరాసులూ అయితే ఇక సంగీతానికీ, అందానికీ ప్రత్యేకత ఏముంది? లోకంలో నాకు నచ్చిందీ మెచ్చిందీ అన్నీ నా దగ్గరే ఉండాలనే ప్రలోభం నాకు లేదు. సంగీతానిదేముంది? కావలసినన్ని క్యాసెట్లు.

రికార్డులు. మనం కోరిన సంగీతం వినటానికి అడ్డేముంది? నిన్నెప్పుడూ ఇలా కించ పరచుకోకు. ఈ కాంప్లెక్స్ నుండి బయట పడకపోయావంటే జీవితంలో కోరి కష్టాలు తెచ్చుకొంటావు. ఆత్మవిశ్వాసం పెంచుకో సునీతా. యు ఆర్ ఎగుడ్ గర్ల్. డిస్కవర్ యువర్ సెల్ఫ్. ఈ పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టి హాయిగా నిద్రపో" మెల్లగా తనను నడిపించుకొంటూ వెళ్ళాడు.

★ ★ ★

ఒక వారం రోజులు గడిచాయి. ఒక సెలవు రోజు రాజశేఖర్ స్టూడెంట్సు ఇంటికి వచ్చారు. రాజు ఇంట్లో లేడు. అంత అందంగా నవనాగరికంగా, నవ్వుతూ, తుళ్ళుతూ ఉన్న అమ్మాయిలను ఎలా ఎదుర్కోవాలో, ఎలా పలకరించాలో అర్థం కాలేదు సునీతకు. వాళ్ళను కూర్చోబెట్టి కాఫీ కలపటానికి వెళ్ళింది. డ్రాయింగు రూం నుండి వాళ్ళ మాటలు వినిపిస్తూనే ఉన్నాయి. "మాస్టారి డాబులు చూసి ఏ గంధర్వ కన్యనో వివాహమాడుతాడనుకొన్నాం. తీరా చూస్తే ఈ మొద్దావతారం."

అందరూ పక్కున నవ్వారు.

"ఉష్, ఊరుకో ఆవిడ వినగలదు."

"వింటే మాత్రం అర్థమయితేగదా."

"ఇంగ్లీషు రాదనా?"

"వచ్చినట్టే ఉంది. ఆ మొహం చూస్తే" మళ్ళా అందరూ నవ్వారు.

ఏమీ జరగనట్లు వాళ్ళను సత్కరించి పంపింది సునీత. వాళ్ళందరూ వెళ్ళగానే తలుపులు బిగించి అద్దం ముందు నిలుచుంది. నిజమే తను అందగత్తె కాదు. కానీ నవ్వుకోదగిన వికార రూపం కాదే. మరీ చదువు రాని మొద్దుకాదే. ప్రేమించే భర్త. చక్కటి సంసారం. మరెందుకు తనకీ బాధ? ఆయన అన్నట్టు ఐ షుడ్ డిస్కవర్ మై సెల్ఫ్. నన్ను నేను కనుక్కోవాలి. కాలేజీ చదువులతో ఎవరూ గొప్ప వాళ్ళు కాలేరు. ఇంగ్లీషు మాట్లాడటమే నాగరికత లక్షణం కాదు. భాషదేముంది? ఎంతలో వస్తుంది?

సునీత గదిలో నుండి ఇవతలికి వచ్చింది. వరుసలు వరుసలుగా ఉన్న పుస్తకాలు... తను చదివేసిన చదవ వలసిన పుస్తకాలు ఆదరంగా ఆహ్వానిస్తున్నట్లున్నాయి. పుస్తకాలంటే తన ప్రాణమనుకొందే. ఆ స్నేహితులను ఎలా మరిచిపోయింది ఇన్నాళ్లూ?

సాయంత్రం రాజుకు చిరునవ్వుతో స్వాగతం పలికింది. "అమ్మాయిలు ఇంటికి వచ్చారట..." కాస్త సంశయిస్తూ అన్నాడు రాజు.

"అతిథి మర్యాదలకు లోటు జరగలేదు లేండి." అంది నవ్వుతూ.

ఇంతలో బల్లమీద ఉన్న కాగితాలపై రాజు దృష్టి పడింది. "ఇవేమిటి?" అన్నాడు వాటిని తీస్తూ.

సునీత కించపడలేదు. కాస్త మృదువుగా అంది "ఐ డిస్కవర్డ్ మై సెల్ఫ్ - ఏవో తరంగాలలా కొన్ని భావాలు నాలో కదిలాయి. వాటినే కాగితం మీద పెట్టాను. ఎంతో తృప్తిగా ఉంది."

"గుడ్ ... ఎప్పుడూ ఇలాగే ఉల్లాసంగా ఉండాలి. జీవితం మనకిచ్చే ఆనందాలెన్నో ఉన్నాయి. అవి గుర్తించకుండా మనం లేని వాటిని గురించి దుఃఖపడుతుంటాం ఎందుకు?"

"ఇప్పుడు నాకే దుఃఖమూ లేదు... ఇంతకూ మీరు నా ప్రశ్నకొక దానికి సమాధానం చెప్పనే లేదు." అంది సునీత.

"ఏమిటి?"

"నాలో ఏం చూసి పెళ్ళి చేసుకొన్నారు?"

నవ్వేశాడు రాజు.

"చెప్పండి"

"నీ కళ్ళు చూసి"

"నా కళ్ళలో ఏముంది?"

"నేను లేనూ."

అతని గుండెపై తల వాల్చింది.

"పుణ్యం కొద్దీ పురుషుడు" అంది మెల్లగా.

"ఉహు... పుణ్యం కొద్దీ స్త్రీ. పురుషులు - అను. లేదా అదృష్టం కొద్దీ అతివ... అంటే నువ్వు" అన్నాడు ఆమెను మరింత దగ్గరకు తీసుకొంటూ.

*(1994)*